

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY


ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి
ఆళ్లగడ్డ
9440232308,9494498787


PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 29-04-2026 సంపుటి: 07 సంచిక 328 పేజీలు: 8 వెల: రూ 3-00

# గూగుల్ క్లౌడ్ ఇండియా ఏఐ హబ్ శంకుస్థాపన

## గూగుల్ భారత్ గ్రోత్ ఇంజన్ గా మారుతుంది ముఖ్యమంత్రి చంద్రబాబు



విశాఖ,గూగుల్ క్లౌడ్ ఇండియా ఏఐ హబ్ కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేసారు. తరువాత ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఏపీ చరిత్రలో కొత్త టెక్ శకానికి శ్రీకారం చుడుతున్న రోజు ఇది. గూగుల్ రాక విశాఖకే కాదు ఏపికి ఓ గేమ్ చేంజర్. 30 ఏళ్ల క్రితం సైబరాబాద్ ను ఐటీ సిటీగా నిర్మాణం చేస్తే సంపద సృష్టికి కేంద్ర అయ్యింది. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుతో భారత చరిత్రలో 2026 ఏప్రిల్ 28వ తేదీ శాశ్వతంగా నిలిచిపోతుంది. 5 బిలియన్ డాలర్ల పెట్టుబడితో టెక్నాలజీ రంగంలో ఏపీ తలెత్తుకుని నిలబడుతుంది. ఆసియాలోనే అతిపెద్ద డేటా సెంటర్ ఇది... దేశానికి ఏఐ డేటా గేట్ వేగా ఏపీ నిలుస్తుందని అన్నారు.సెర్చ్ ఇంజన్ గా మొదలైన గూగుల్ భారత్ గ్రోత్ ఇంజన్ గా మారుతుంది. ప్రతీ ఒక్కరూ గూగుల్ లో సెర్చ్ చేస్తే గూగుల్ ఏపీని వెతుక్కుంది. ప్రతిష్టాత్మక సంస్థ అదానీ గ్రూప్, ఎయిర్ టెల్ లాంటి దిగ్గజ సంస్థలు ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేస్తాయి. 2028 సెప్టెంబరు నాటికి ఈ ప్రాజెక్టు పూర్తి చేసి ప్రారంభించాలని కోరుతున్నాను. ప్రాజెక్టు సకాలంలో పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుంది. ఈ ప్రాంతానికి నీటి సమస్య లేదు. 60 రోజుల్లోనే గోదావరి నీరు విశాఖకు తీసుకువస్తాం. ఏపీ ప్రభుత్వం అందిస్తున్న స్పీడ్ ఆఫ్ గవర్నెన్సుకు గూగుల్ ఏఐ డేటా సెంటర్ నుంచి కూడా సహకారం తీసుకుంటాం. సీఎంఓలోని నలుగురు కార్యదర్శులతో పాటు నాకు కొత్తగా ఏఐ అసిస్టెంట్ కూడా సుపరిపాలన అందించేందుకు సహకారం అందిస్తుంది. బులెట్ ట్రైన్ లాంటి ప్రాజెక్టుతో పాటు రాష్ట్రంలోని వివిధ రైల్వే స్టేషన్లను ఆధునీకరిస్తున్నాం. వచ్చే నాలుగేళ్లలో ఈ ప్రాజెక్టులు సాకారమయ్యేలా చూడాలని కోరుతున్నాను. జూన్ 1వ తేదీ నుంచి సౌత్ కోస్టల్ రైల్వే జోన్ కు అధికారికంగా నోటిఫికేషన్ జారీ చేస్తున్నందుకు రైల్వే మంత్రికి ధన్యవాదాలని అన్నారు.ఈస్ట్ వెస్ట్ కారిడార్ ను కలపటం ద్వారా ఈ ప్రాంతాన్ని లాజిస్టిక్స్ పరంగా కూడా అభివృద్ధి చేయవచ్చు. దేశంలోకి వచ్చిన 25 శాతం పెట్టుబడులు ఏపీకే వచ్చాయి. ఒప్పందాలకు, పెట్టుబడులకే కాదు... ప్రాజెక్టుల గ్రౌండింగ్ లో కూడా ఏపీ నెంబర్ 1గా ఉంది. పోలవరం ప్రాజెక్టు 2027 నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. 90 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి ఇప్పటికే ఒప్పందం చేసుకున్నాం. గూగుల్ రావటంతో విశాఖలోని యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు వస్తాయి.

ఉత్తరాంధ్ర అంటే గతంలో వలసలు, నిరుద్యోగం కానీ ఇప్పుడు ఇతర ప్రాంతాల నుంచి ఉత్తరాంధ్రకే వలస వస్తారు. ఇక ట్యాలెంట్ మైగ్రేషన్ ముగిసింది.జూలైలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేస్తాం. 2028 నాటికి ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ నుంచి కూడా తొలి షిప్ మెంట్ ఎగుమతి అవుతుంది. రెన్యూ పవర్ ద్వారా ఇంగాట్ సోలార్ వేఫర్స్ ఉత్పత్తి కూడా మొదలవుతుంది. అనకాపల్లి జిల్లా మరో రంగారెడ్డి జిల్లాగా తయారై అభివృద్ధికి కేంద్రం అవుతుందని అన్నారు.

# రెండు అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు మోదీ పచ్చజెండా



వారణాసి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొత్తగా రెండు అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రారంభించారు. వారణాసి–పుణె, అయోధ్య–ముంబై అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు మంగళవారంనాడిక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో పచ్చజెండా ఊపారు. అయోధ్య–ముంబై రైలుతో శ్రీరామ మందిర్ తీర్థ్ క్షేత్ర్‌కు అనుసంధాన మరింత మెరుగవుతుంది. రూ.6,350 కోట్ల విలువైన పలు ప్రాజెక్టులకు కూడా మోదీ శంకుస్థాపన చేశారు.'నారీ శక్తి వందన్–వికాస్‌కు ఈ రోజు ఒక పండుగ. కొద్ది నిమిషాల క్రితమే ఇక్కడి నుంచి శంకుస్థాపనలు చేశాం. వేల కోట్ల రూపాయలతో ప్రాజెక్టులు ప్రారంభించాం. కాశీ సర్వతోముఖాభివృద్ధికి అవసరమైన ప్రాజెక్టులు ఇందులో ఉన్నారు. కాశీ, అయోధ్య మధ్య కనెక్టివిటీ పెంచే పనులు కూడా ఉన్నాయి. కొత్తగా రెండు అమృత్ భారత్ రైళ్లను ప్రారంభించాం. కాశీ నుంచి పుణె, అయోధ్య నుంచి ముంబైకి ఈ రైళ్లు ప్రయాణం సాగిస్తాయి. తద్వారా ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర మధ్య కనెక్టివిటీ కూడా మరింత మెరుగవుతుంది. ముంబై, పుణే సహా మహారాష్ట్రకు చెందిన వారంతా అయోధ్య థామ్, కాశీ విశ్వనాథ్ థామ్ వెళ్లేందుకు మరో మోడ్రన్ ఆప్షన్‌ను కూడా అందుబాటులోకి తెచ్చాం' అని మోదీ అన్నారు.దేశ సంక్షేమం కోసం చేపడుతున్న ఈ మహాయజ్ఞంలో ఆడపడుచుల ఆశీస్సులు పొందేందుకే తాను ఇక్కడికి వచ్చానని ప్రధాని అన్నారు. కాశీ ఎంపీగా, దేశ ప్రధానిగా ప్రజల ఆశీస్సులు కోరుకుంటున్నానని అన్నారు. లోక్‌సభ, విధానసభల్లో మహిళలకు రిజర్వేషన్ అమలు చేయడం తమ ప్రధాన లక్ష్యమని, అయితే కొద్ది రోజుల క్రితం తమ ప్రయత్నాలు సమాజ్‌వాది పార్టీ, కాంగ్రెస్ వల్ల విజయవంతం కాలేదని అన్నారు. అయితే మహిళలకు రిజర్వేషన్ హక్కులు దక్కేంతవరకూ తాము వెనుకాడేది లేదని లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్, టీఎంసీ, డీఎంకే వంటి పార్టీలు మహిళలను మరోసారి వంచించాయని, 40 ఏళ్లుగా మహిళలకు రిజర్వేషన్ హక్కులను దక్కకుండా బ్రేక్‌లు వేస్తున్నాయని విమర్శించారు.

# ఇంధనాన్ని పక్కదోవ పట్టిస్తే కఠిన చర్యలు: మంత్రి నాదెండ్ల మనోహర్




అమరావతి, ఏప్రిల్ 28: ఇంధన సమస్యపై మంత్రి నాదెండ్ల మనోహర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇంధనాన్ని పక్కదోవ పట్టించే వారిపై కఠినంగా వ్యవహరించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. పెట్రోల్ బంకుల్లో ఇంధన నిల్వలు ఉన్నా సరే.. లేదని వాహనదారులకు చెబుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వినియోగదారుల సేవా కేంద్రం టోల్ ఫ్రీ నంబర్ 1967కు వచ్చిన ఫిర్యాదుల్లో అధిక భాగం పెట్రోల్ బంకులు ఇంధనం ఇవ్వడం లేదని వస్తున్నాయన్నారు. ఈ ఫిర్యాదులపై జిల్లావారీగా రిపోర్టులు సేకరించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.రాష్ట్రంలో పెట్రోల్ బంకుల మూసివేతలు క్రమంగా తగ్గుతున్నాయని మంత్రి తెలిపారు. ఆయిల్ కంపెనీల నుంచి డిస్పాచ్‌లు వేగంగా జరుగుతున్నాయని అన్నారు. వస్తున్న లోడ్లు వాహనదారులకు పూర్తిస్థాయిలో అందేలా చొరవ తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని మంత్రి ఆదేశించారు. ఆక్వా రైతులు ప్రస్తుతం కీలక సమయంలో ఉన్నారని.. వారికి ఏ పరిస్థితుల్లోనూ ఇంధన కొరత రాకుండా చూడాలని తెలిపారు. రబీ పంట కోతల సమయంలో కూడా రైతులకు ఆయిల్ సకాలంలో అందేలా వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు సమన్వయం చేసుకొని పని చేయాలని ఆదేశించారు. ఎక్కడైనా ఇబ్బంది ఏర్పడితే ఉన్నతాధికారులు వెంటనే స్పందించేలా ఏర్పాట్లు చేయాలని, సోషల్ మీడియాలో అనవసరమైన పుకార్లు వ్యాప్తి చేసేవారిపై నిఘా ఉంచాలని సూచనలు చేశారు. కృత్రిమ కొరత సృష్టించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. పరిస్థితి పూర్తిస్థాయిలో అదుపులోకి వచ్చే వరకు నిరంతర సమీక్ష, సమన్వయం అవసరమని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

## ప్రైవేట్ కాలేజీ కోసం రోడ్డు నిర్మాణం.. సీఐడీ దర్యాప్తునకు హైకోర్టు ఆదేశం

అమరావతి, ఏప్రిల్ 28: కడప జిల్లా ప్రొద్దుటూరులో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఓ ప్రైవేట్ కాలేజీ కోసం.. లే అవుట్‌లో ప్రభుత్వ నిధులతో రహదారి వేశారు. దీనిపై ఏపీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేశారంటూ.. సీఐడీ విచారణకు హైకోర్టు ఆదేశించింది. ఈ అంశంపై కోర్టులో మంగళవారం విచారణ జరిగింది. ఈ నేపథ్యంలో ఏపీ హైకోర్టు పైవిధంగా స్పందించింది. తమ అనుమతి లేకుండా రహదారి వేశారంటూ లే అవుట్‌లోని పలువురు భూ యజమానులు హైకోర్టును గతంలో ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపి నివేదిక అందించాలంటూ జిల్లా కలెక్టర్‌ను హైకోర్టు ఆదేశించింది.రహదారి వేసే సమయంలో ఎవరూ అభ్యంతరం చెప్పలేదని.. కానీ ప్రైవేట్ భూముల్లో భూ సేకరణ చేయకుండానే ఈ రోడ్డు వేశారంటూ కోర్టుకు జిల్లా కలెక్టర్ నివేదిక అందజేశారు. రోడ్డు నిర్మాణం వల్ల ప్రభుత్వ ధనం దుర్వినియోగమైందని కోర్టు స్పష్టం చేసింది. దీనికి ఆ సమయంలో ఉన్న అధికారులు, కౌన్సిల్ చైర్మన్‌తో పాటు సభ్యులు కారణమయ్యారని స్పష్టం చేసింది. ప్రభుత్వ ధనం దుర్వినియోగం కావడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది.


# పెట్టుబడులతో ఏపీ కొత్త చరిత్ర సృష్టిస్తోంది: మంత్రి లోకేశ్




విశాఖపట్నం, ఏప్రిల్ 28 : డబుల్ ఇంజిన్ సర్కార్‌తో రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యశాఖల మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తో ఏపీలో ప్రయోజనాలు చూపిస్తున్నామని పేర్కొన్నారు.తర్లువాడలో రూ. 1.35 లక్షల కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్న గూగుల్ ఏఐ డేటా సెంటర్‌కు సీఎం చంద్రబాబు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో గూగుల్ క్లౌడ్ సంస్థ ప్రతినిధులు, కేంద్రమంత్రులు అశ్విని వైష్ణవ్, కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, శ్రీనివాసవర్మ, హోంమంత్రి వంగలపూడి అనిత పాల్గొన్నారు. ఈ డేటా సెంటర్‌కు తర్లువాడ, రాంబిల్లి, అడవివరంలో 600 ఎకరాలను ఏపీ సర్కార్ కేటాయించింది. ఈ కార్యక్రమంలో పాల్గొని మంత్రి లోకేశ్ మాట్లాడారుఎఎజింఉలో ఉ అంటే గూగుల్ అని మంత్రి లోకేశ్ వ్యాఖ్యానించారు. ఇప్పటివరకు ఒకలెక్క.. ఇక నుంచి మరో లెక్క అని చెప్పుకొచ్చారు. ఇవాళ్టి నుంచి విశాఖ ముఖచిత్రం మారబోతోందని తెలిపారు. సరికొత్త చరిత్రకు ఇవాళ పునాదిగా మారిందని వెల్లడించారు. ఇకపై డేటా ఏఐ హబ్‌గా విశాఖపట్నం మారుతోందని వివరించారు. పెట్టుబడులతో ఏపీ కొత్త చరిత్ర సృష్టిస్తోందని ఉద్ఘాటించారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలోని ఐదేళ్లు ఏపీలో విధ్వంస పాలన చూశామని విమర్శించారు. గూగుల్ ప్రాజెక్టు తెచ్చిందెవరని గూగుల్‌ని అడిగితే చంద్రబాబు పేరే చెబుతోందని అన్నారు. వైసీపీ పాలనలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు భయపడ్డారని ఆరోపించారు. తమది గూగుల్.. వైసీపీది గొడ్డలి.. బోత్ ఆర్ నాట్ సేమ్ అని చెప్పుకొచ్చారు. నమో అంటే నాయుడు.. మోదీ అని మంత్రి లోకేశ్ అభివర్ణించారు.

## న్యాయవ్యవస్థపై గౌరవం.. కానీ సత్యాగ్రహం తప్పదు: కేజ్రీవాల్

ఢిల్లీ, ఏప్రిల్ 28: ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ , మాజీ ఉపముఖ్యమంత్రి మనీష్ సిసోడియా రాజ్‌ఘాట్‌ను సందర్శించారు. మహాత్మా గాంధీ స్మారకం వద్ద పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో బెయిల్‌పై విడుదలైన తర్వాత కేజ్రీవాల్.. గాంధీ స్మారకాన్ని సందర్శించడం ప్రాధాన్యం సంతరించుకుంది.ఈ కార్యక్రమంలో కేజ్రీవాల్, సిసోడియాలతో పాటు ఢిల్లీ మాజీ సీఎం అతిశీ మర్లెనా, ఆప్ ఎమ్మెల్యేలు, పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు. మహాత్ముడి అడుగుజాడల్లో నడుస్తూ అవినీతిపై పోరాటం కొనసాగిస్తామని ఈ సందర్భంగా వారు ప్రతిజ్ఞ చేశారు.రాజ్‌ఘాట్ సందర్శన అనంతరం కేజ్రీవాల్ మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. న్యాయ పోరాటం, ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీ మద్యం స్కాం కేసు కోర్టుకు సంబంధించిన విషయమని.. తాము భారత న్యాయ వ్యవస్థను, కోర్టులను పూర్తిస్థాయిలో గౌరవిస్తామని స్పష్టం చేశారు. తమపై వచ్చిన ఆరోపణలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన పేర్కొన్నారు. ఈకేసులో న్యాయవ్యవస్థ తమను నిర్దోషులుగా గుర్తించిందని, అందుకే బెయిల్ మంజూరు చేసిందని కేజ్రీవాల్ గుర్తు చేశారు. తమ నిజాయతీకి ఇదే నిదర్శనమని ధీమా వ్యక్తం చేశారు.


ఆళ్ళగడ్డ ప్రజలకు శుభవార్త!
ఆవుల ఫుడ్ కాంప్లెక్స్

రాగి రొట్టె సద్ద రొట్టె జొన్న రొట్టె కారం రొట్టె
మా వద్ద స్వచ్ఛమైన, కల్తీలేని నాణ్యమైన జొన్నరొట్టె రాగి రొట్టె, సద్ద రొట్టె, కారం రొట్టె లభించును.
ధర కేవలం 10/- మాత్రమే
కారం రొట్టె 15/- మాత్రమే
అన్ని రకముల శుభకార్యములకు ఆర్డర్లపై సప్లయ్ చేయబడును.
తప్పక విచ్చేయండి... ఆవుల ఫుడ్ కాంప్లెక్స్
ఆవుల విజయభాస్కర్‌రెడ్డి కాంప్లెక్స్ పైన, 4 రోడ్స్ సెంటర్, కోవెలకుంట్ల రోడ్డు, ఆళ్ళగడ్డ.
Cell : 8332889900 ప్రొ॥ ఆవుల విజయభాస్కర్ రెడ్డి అడ్వకేట్ ఆళ్ళగడ్డ.
ఉదయం 11-00 నుండి మధ్యాహ్నం 2-00 గం॥ వరకు
సాయంత్రం 6-30 నుండి రాత్రి 8-30 గం॥వరకు
@ Padmasree Printers, Allagadda : 9951261617

# సంపాదకీయం

బుధవారం 29-04-2026

## బంగారం ఆస్తే...

బంగారం కొనుగోలు విషయంలో భారతీయుల ట్రెండ్ మారుతోంది. ఒకప్పుడు బంగారం అంటే అలంకరణ సాధనంగానే చూసేవారు, నగలనే అధికంగా కొనుగోలు చేసేవారు. అయితే, పసిడి ధరలు రికార్డ్ గరిష్ఠాలకు చేరిన క్రమంలో బంగారాన్ని పెట్టుబడిగా పరిగణిస్తున్నారు. బంగారంలో పెట్టుబడి పెడితే అధిక లాభం పొందొచ్చని భావిస్తున్నారు. ప్రస్తుతం దేశీయంగా బంగారం, వెండి ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. గతంలో పరుగులు పెట్టిన రెండు లోహాల ధరలు.. ఇప్పుడు క్రమంగా దిగి వస్తున్నాయి. ధరలు తగ్గడం మహిళలకు కొంత ఉపశమనం కలిగించినట్లే. అయితే దేశీయ మార్కెట్లో గత మూడు రోజులుగా బంగారం, వెండి ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. ఏప్రిల్ 28న కూడా స్వల్పంగా తగ్గాయి. గత వారం రోజులుగా భారీగా తగ్గిన ధరలు ఒక్కసారి మాత్రమే పెరిగాయి. అంటే ఇదే మంచి అవకాశంగా చెప్పవచ్చు. అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు పెరగడం, క్రూడ్ ఆయిల్ ధరలు రికార్డ్ స్థాయిలోనే ఉండడం వంటివి బంగారం ధరలు తగ్గేందుకు కారణమవుతున్నట్లు బులియన్ మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఈ నెలలో 24న బంగారం ధరలు కాస్త పెరిగినట్లు కనిపించినా రికార్డ్ గరిష్ఠాలకు చాలా దూరంగానే ఉన్నాయి2025లో బంగారాన్ని పెట్టుబడుల కోసం కొనుగోలు చేయడం 40 శాతానికి చేరినట్లు ఓ నివేదిక వెల్లడించింది. ముందు ముందు ఇది మరింత పెరగవచ్చ నివేదిక తెలిపింది.అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులతో బంగారం ధరలు రికార్డ్ స్థాయికి చేరుకున్నాయి. ఏడాది కాలంలోనే ఊహించని విధంగా పెరిగాయి. ఈ క్రమంలో భారతీయులు బంగారం కొనుగోలు చేసే దృక్పథం మార్చుకుంటున్నారని ప్రముఖ రేటింగ్స్ ఏజెన్సీ కేర్ఎడ్జ్ రేటింగ్స్ నివేదిక వెల్లడించింది. భారత్‌లో గత ఏడాది 2025లో బంగారాన్ని పెట్టుబడుల కోసం కొనుగోలు చేయడం 40 శాతానికి ఎగబాకినట్లు తెలిపింది. అంతకు ముందు ఏడాది వరకు అది 30 శాతానికి లోపే ఉండాదని, మిగితా 70 శాతం పైన అలంకరణ కోసం బంగారు ఆభరణాలు మాత్రమే కొనుగోలు చేసే వారని పేర్కొంది. అయితే, ధరలు పెరుగుతుండడం వంటి కారణాలతో నగలకు బదులుగా ఆస్తులకు ప్రాధాన్యత ఇస్తూ పెట్టుబడులు పెడుతున్నారని పేర్కొంది.గత ఏడాదిలో పెట్టుబడుల కోసం మేలిమి బంగారం కొనుగోళ్లు, డిజిటల్ విధానంలో కొనుగోళు అనేవి ఎక్కువగా జరిగాయని కేర్ ఎడ్జ్ నివేదిక పేర్కొంది. బంగారం ఈటీఎఫ్‌ల ద్వారానే ఏకంగా 37.5 టన్నుల బంగారానికి సమానమైన పెట్టుబడులు వచ్చినట్లు తెలిపింది. గత 10 సంవత్సరాల కాలంలో వచ్చిన మొత్తం పెట్టుబడుల కంటే ఇది ఎక్కువగా ఉండడం గమనార్హం. 2026-27 ఆర్థిక సంవత్సరం లోనూ మొత్తం బంగారం వినియోగంలో పెట్టుబడుల విలువ 35-40 శాతం వరకు ఉండవచ్చని అంచనా వేసింది. 2026లోనూ బంగారం ధరలు గరిష్ఠ స్థాయుల్లోనే కొనసాగుతాయని కేర్ ఎడ్జ్ డైరెక్టర్ అఖిల్ గోయల్ అంచనా వేశారు.గత ఏడాది 2025లో నగల గిరాకీ, విలువ పరంగా వార్షికంగా 10 శాతం మేర పెరిగి రూ.4.8 లక్షల కోట్లకు చేరుకున్నట్లు తెలిపింది. అధిక ధరల కారణంగా వినియోగదారులు తేలికైన, తక్కువ క్యారెట్ల ఆభరణాలకు మొగ్గు చూపుతున్నారని, అలాగే ఈ లోహాల అమ్మకాల పరిమాణ 15 శాతం మేర పడిపోయినట్లు నివేదిక వెల్లడించింది. 2025-26 ఆర్థిక ఏడాదిలో ఆభరణాల పెద్ద వ్యాపారులు 35 శాతం ఆదాయ వృద్ధిని నమోదు చేయగా 2026-27 ఆర్థిక సంవత్సరంలో అది 20-25 శాతానికి తగ్గవచ్చని అంచనా వేసిందిఈ ట్రెండ్ భారత్‌కు మాత్రమే పరిమితం కాలేదని, ప్రపంచ వ్యాప్తంగా ప్రజల ధోరణి మారుతోందని కేర్ ఎడ్జ్ రేటింగ్స్ తెలిపింది. 2025లో బంగారం పెట్టుబడుల డిమాండ్ 2175 మెట్రిక్ టన్నులకు చేరిందని, అది అంతకు ముందు 2020లోని 1805 టన్నులను మించినట్లు తెలిపింది. ఇందులో ఎక్స్ఛేంచ్ ట్రేడెడ్ ఫండ్స్ వాటానే ఎక్కువగా ఉందని తెలిపింది. అలాగే బంగారు కడ్డీలు, నాణెల కొనుగోలు సైతం పెరిగిందని, అది 12 ఏళ్ల గరిష్ఠ స్థాయికి చేరుకుందని తెలిపింది. భారత్‌లోనూ గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి పెట్టుబడులు భారీగా వస్తున్నట్లు నివేదిక తెలిపింది. 2025 ఒక్క ఏడాదిలోనే 37.5 టన్నులకు సరిపడా పెట్టుబడులు వచ్చాని పేర్కొంది.అహ్మదాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ఇండియా గోల్డ్ పాలసీ సెంటర్ హెడ్ ప్రొఫెసర్ సుందరవల్లి నారాయణస్వామి అంచనాల ప్రకారం ఆర్‌బీఐ వద్ద సుమారు 800-820 టన్నుల బంగారం ఉంది. అలాగే దేశంలో ఆర్థికంగా వెలికితీయగల బంగారం సుమారు 70-80 టన్నులు మాత్రమే" అని ఆయన చెప్పారు.ఆర్థికంగా వెలికితీయగల బంగారం అంటే ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానంతో లాభదాయకంగా తవ్వి తీసుకోగల బంగారం అని అర్థం.భారత్‌లో మంచి నాణ్యత గల బంగారం తక్కువగా ఉంది, కాబట్టి ఇక్కడ మైనింగ్ పోటాపోటీగా ఏవీ జరగదు'' అని ప్రొఫెసర్ సుందరవల్లి అంటున్నారు."భారతీయుల దగ్గర చాలా బంగారం ఉంది. ఎంత బంగారం ఉందనే విషయంపై భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ అది సాధారణంగా 25 వేల నుంచి 27 వేల టన్నుల వరకు ఉంటుందని భావిస్తున్నారు" అని ఆయన అన్నారు.ఈ అంకెకు ఆధారం ఏంటని అడగ్గా, ఇది చాలా మంది నమ్మే ఒక సాధారణ అంచనా మాత్రమే అని ఆయన అన్నారు."ప్రతిఏటా 600 నుంచి 700 టన్నుల బంగారం దిగుమతి అవుతుండగా, ఎగుమతి చాలా తక్కువ.

## జైలు లో బీఆర్ఎస్ నేతలను పరామర్శించిన హరీష్ రావు

సంగారెడ్డి ,జిల్లా కంది సెంట్రల్ జైలులో రిమాండ్లో ఉన్న బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్తో పాటు మరో ఏడుగురు పార్టీ కార్యకర్తలను మాజీ మంత్రి హరీష్ రావు పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలు, రైతుల ఇబ్బందులు, రాష్ట్ర అభివృద్ధిని గాలికొదిలేసి.. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే గొంతులపై అక్రమ కేసులు, సిట్లు, కమిషన్లు వేస్తూ అణచివేసే కుట్ర చేస్తోంది.రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలతో పాటు ఏడో గ్యారంటీగా ప్రజాస్వామ్యం కల్పిస్తామని చెప్పి నేడు నియంతలా వ్యవహరిస్తున్నారు. కేసీఆర్, బీఆర్ఎస్ నాయకత్వంపై ఫేక్ పోస్టులు పెడుతున్న వారి గురించి పోలీసులకు ఆధారాలతో సహా ఫోన్ అప్పగించి క్రిశాంక్ ఫిర్యాదు చేశారు. కానీ తప్పు చేసిన వారిని వదిలేసి, కంప్లైంట్ ఇచ్చిన క్రిశాంక్ నే అరెస్టు చేయడం అత్యంత దుర్మార్గం. దొంగలను వదిలేసి ఫిర్యాదుదారులను జైల్లో పెడతారా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి, హోం మంత్రి రెండు బాధ్యతలూ మీరే పెట్టుకుని ఇలాంటి అరాచకాలకు పాల్పడతారా రేవంత్ రెడ్డి. ఇదేనా మీ ప్రజాస్వామ్యం? క్రిశాంక్ పై నాన్ బెయిలబుల్ కేసులు ఎలా పెడతారని సాక్షాత్తూ మెజిస్ట్రేట్ పోలీసులను ప్రశ్నించారంటేనే మీ కక్షసాధింపు ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. అంగన్వాడీ ఫోన్ల కుంభకోణం, టెన్త్ పేపర్ లీక్, హెచ్సీయూ గచ్చిబౌలి భూములు, సోమ్ డిస్టిలరీస్ వ్యవహారం, మిస్ వరల్డ్ పోటీల్లో మిస్ ఇంగ్లాండ్ వివాదం.. ఇలా భుత్వ తప్పులను ఎత్తిచూపినందుకే ఆయనపై వరుసగా కేసులు పెట్టారు. భారత పౌరులకు ప్రశ్నించే హక్కు లేదా? లగచర్లలో గిరిజనుల పైనా, మెదక్, సంగారెడ్డిలో మా నాయకుల పైనా అక్రమ కేసులు బనాయించారు. రేవంత్ రెడ్డి ఇలా కేసులు పెట్టి మళ్లీ గెలుస్తాననుకుంటే అది హిట్లర్ ను మించిన మూర్ఖత్వమే. జూబ్లీహిల్స్ ప్యాలెస్ లో కూర్చుని నేనే రాజు, నేనే మంత్రి అనుకుంటున్నావు. మీ అరాచకాలను గమనిస్తున్న రాష్ట్ర ప్రజలు తగిన బుద్ధి చెబుతారు. బెంగళూరు నుంచి ప్రైవేట్ హ్యాకర్లను తెచ్చి కమాండ్ కంట్రోల్ రూమ్లో కూర్చోబెట్టారు. ప్రతిరోజూ బీఆర్ఎస్ నేతల ఫోన్లను, మా ఇళ్ల ముందున్న సీసీ కెమెరాలను చట్టవ్యతిరేకంగా హ్యాక్ చేస్తున్నారని ఆరోపించారు. మా ఫోన్లు ట్యాప్ చేస్తున్న ఐపీఎస్ అధికారులకు ఇదే మా హెచ్చరిక. మా దగ్గర అన్ని ఆధారాలు ఉన్నాయి. మేము అధికారంలోకి వచ్చాక రిటైర్ అయినా సరే మిమ్మల్ని ఎక్కడున్నా వదిలిపెట్టం. కచ్చితంగా విచారణ జరిపిస్తాం. చట్ట వ్యతిరేక పనులు చేస్తున్న ఐపీఎస్ అధికారులకు తగిన మూల్యం తప్పదు. అప్పుడు మిమ్మల్ని రేవంత్ రెడ్డి కూడా కాపాడలేడు. మీ సొంత డబ్బుతో అడ్వకేట్లను పెట్టుకుని కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుంది. కాబట్టి చట్టానికి లోబడి పనిచేయండి. క్రిశాంక్ ను జైల్లో పెట్టి రేవంత్ రెడ్డి వికృత ఆనందం పొందుతున్నాడు. మీ పార్టీ కార్యాలయంలో జరిగే అవినీతి, అక్రమాల వ్యవహారాలన్నీ రికార్డు అవుతున్నాయి. రేవంత్ రెడ్డికి మాటలు ఎక్కువ, చేతలు తక్కువ. జూబ్లీహిల్స్ ప్యాలెస్ చాలదన్నట్టు ఎంసీఆర్హెచ్ఆర్డీలో వంద కోట్లతో కొత్త ప్యాలెస్ కట్టుకుంటున్నావు. నీ పాలనలో సగం కాలం పూర్తయింది, మిగిలిన సగం కాలమైనా ప్రజలకు ఏదైనా మేలు చేసే ప్రయత్నం చెయ్. రైతులు 20 రోజులుగా కొనుగోలు కేంద్రాల దగ్గర పడిగాపులు కాస్తుంటే శనగలు, సన్ ఫ్లవర్ కొనే నాథుడే లేడు. మీ మంత్రులు నిద్రపోతున్నారా? మీ ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఏం చేస్తోంది? ఎకరాకు కేవలం 26 క్వింటాళ్లు మాత్రమే కొంటామని మక్కలకు కొత్త షరతులు పెట్టి రైతులను ఇబ్బంది పెడుతున్నారు. 13 లక్షల ఎకరాల్లో పంట వస్తే కనీసం సగం కూడా కొనలేని దుస్థితిలో మీరున్నారు. వడ్ల కొనుగోలు కేంద్రాలు ఇంకా ప్రారంభం కాలేదు. వడ్లకు ఐదారు కిలోల తరుగు తీస్తున్నారు. తరుగు పెడితే తోలు తీస్తానన్న రేవంత్ రెడ్డి ఇప్పుడెవరి తోలు తీస్తాడో చెప్పాలి. మిల్లుల ముందు లారీలు నాలుగైదు రోజులుగా ఆగిపోతున్నాయి. యాసంగి సన్నవడ్లకు బోనస్ ఇస్తావా? ఇవ్వవా? స్పష్టం చెయ్. ఇవ్వలేకపోతే తప్పుకో లేదా జరిగింది చెప్పుకో అంతేకానీ ఏ సంగతీ చెప్పకుండా రైతులను మోసం చేయొద్దు. ఎండలో రైతులు మాడిపోతుంటే పట్టించుకునే తెలివి లేదా? రైతుల కష్టాలు మీకు పట్టవా? ఇప్పటికైనా అక్రమ కేసులు బంద్ చేసి, ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు గురించి ఆలోచించు. ప్రజలు మెచ్చే పాలన అందించు.

## కాకరవాయిలో అనుమతి లేని పాఠశాల మూసివేత




తిరుమలయపాలెం, ఏప్రిల్ 28 : తిరుమలాయపాలెం మండలంలోని కాకరవాయిలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న శ్రీరామ విద్యాలయాన్ని మంగళవారం విద్యాశాఖ అధికారులు మూసివేశారు. గత ఆరేళ్లుగా పాఠశాల అనుమతిని రెన్యువల్ చేసుకోకపోవడం వల్ల పాఠశాల యజమాని మర్రి శ్రీనివాస్ రెడ్డికి నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. అయినా స్పందన లేకపోవడంతో మంగళవారం పాఠశాలను సీజ్ చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి వెల్లడించారు. పాఠశాలను సీజ్ చేసి రికార్డులను స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు.

## ఏథెన్స్ సెక్యూర్టీ ఆఫీసు, కోర్టులో కాల్పులు.. పలువురికి గాయాలు



ఏథెన్స్: గ్రీస్ దేశంలో ఓ ఉన్మాది కాల్పుల(కు పాల్పడ్డాడు. ఏథెన్స్‌లో ఉన్న సోషల్ సెక్యూర్టీ ఆఫీసుతో పాటు కోర్టులో అతను కాల్పులు జరిపాడు. సాయుధ వ్యక్తి జరిపిన కాల్పుల్లో అనేక మంది గాయపడినట్లు తెలుస్తోంది. షూటర్‌ను పట్టుకునేందుకు పోలీసులు ఆపరేషన్ చేపట్టారు. అయితే కాల్పులకు తెగించిన వ్యక్తి వయసు 89 ఏళ్లు అని గ్రీక్ మీడియా పేర్కొన్నది. ఆ వ్యక్తి వద్ద షాట్‌గన్ ఉన్నట్లు తెలిపారు. గ్రీసు రాజధాని ఏథెన్స్‌లో ఉన్న సెక్యూర్టీ ఆఫీసుపై అతను తొలుత అటాక్ చేశాడు. అక్కడో ఉద్యోగి గాయపడినట్లు తెలుస్తోంది. ఆ తర్వాత ఏథెన్స్‌లోనే ఉన్న ఓ కోర్టు బిల్డింగ్ గ్రౌండ్ ఫ్లోర్‌లో కాల్పులు జరిపాడు. అక్కడ పలువురు గాయపడినట్లు తెలుస్తోంది. ఎందుకు ఆ వ్యక్తి కాల్పులకు తెగించాడో ఇంకా స్పష్టం కాలేదు.


## 'సాగులో మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు'

మునుగోడు, ఏప్రిల్ 28 : రైతులు పంటల సాగులో మెళకువలు సాధిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు అన్నారు. మంగళవారం మునుగోడు రైతు వేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వ్యవసాయ శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. వచ్చే వానకాలంలో పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతులు, నాణ్యమైన విత్తనాల ఎంపిక, పంటల్లో వచ్చే చీడపీడల నివారణ, సమస్యాత్మక నేలల యాజమాన్య పద్ధతులను వివరించారు. అలాగే అధిక సాంద్రత పత్తి, వాటి లాభాలు, యాజమాన్య పద్ధతులు, పంట మార్పిడి, పురుగు మందుల పిచికారి విధానం గురించి వివరించారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ రామకృష్ణ బాబు, సాయి ప్రియ, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.



## చంపాపేట లో ఎంపి ఈటల పర్యటన

హైదరాబాద్,చంపాపేట్ డివిజన్ లో కాలనీ సమస్యలను పరిశీలించి, పలు అభివృద్ధి కార్యక్రమాలలో ఎంపి ఈటల రాజేందర్ పాల్గొన్నారు. ఎంపి మాట్లాడుతూ సాయి నగర్ మద్దెల చెరువు ఒక మురికి కూపం లాగా ఉండేది. ఈ ప్రాంతంలో ఉన్న డ్రైనేజ్ అంత ఇక్కడే నిల్వ ఉండి, ఈగలు, కంపు వాసన, చుట్టుపక్కల ఎక్కడ బోరు వేసినా పొల్యూటెడ్ వాటర్ తో సతమతమవుతున్నారాని దివంగత నేత వంగ మధు గారు మంచినీళ్ల చెరువుగా చేయాలని ప్రయత్నం చేసి కోటి రూపాయలతో డ్రైనేజీ పైప్ లైన్ వేయించారు. కానీ శుభ్రపరిచే వాళ్ళు లేక పైపు



కెపాసిటీ సరిపోక ఎక్స్ట్రా ఆయన నీరంతా కూడా చెరువులోకి పోయి మళ్ళీ మురికి కూపం లాగా మిగిలిపోయింది. దీని ప్రక్షాళన కోసం మురికి నీరు చెరువులోకి రాకుండా ఉండటం కోసం, అవసరమైతే ఇంకో పైప్లైన్ వేసి దాని కెపాసిటీ పెంచుతామని అన్నారు.చెరువు దగ్గర జులాయిల, పోకిరిల అడ్డాగా మారిపోయింది. ఇది మాదకద్రవ్యాలకు అడ్డాగా కాకుండా ఉండాలని పోలీసులకు ఫిర్యాదు చేస్తాము. చెరువు చుట్టూ ఫెంక్షన్ కూడా వేయించాలని కోరారు. దానిపై నేను అధికారులతో మాట్లాడి వేయించే ఏర్పాటు చేస్తానని హామీ ఇస్తున్నాను. ప్రజలు సమస్యలతో సతమతమవుతుంటే రాజకీయాల, ఫోటోల, ఆధిపత్యం కోసం పాకులాడే వాళ్ళని చూస్తున్నాం. ప్రజలకు ఎవరు ఏం చేస్తారో గమనిస్తూనే ఉన్నారు. ఈ ప్రాంత ప్రజలు నా దగ్గరకు వచ్చి కంప్లైంట్ చేస్తే నేను పరిశీలిస్తానని చెప్పాను ఇప్పుడు వచ్చి పరిశీలిస్తున్నాను. దీనికి ఏవేమి పనులు పెండింగ్ ఉన్నాయో అవన్నీ చేసే ప్రయత్నం చేస్తానని అన్నారు.హైదరాబాదులో ఎక్కడ చూసినా ఏదో ఒక మూలన పైప్ లైన్ కోసం తవ్వుతూనే ఉంటారు. వేగంగా పెరుగుతున్న సిటీకి అనుగుణంగా పైప్లైన్ కెపాసిటీ ఉండాలి. మెగా ఫంక్షన్ హాల్ దగ్గర దివంగత నేత వంగ మధు గారి ప్రోత్బలం, నేను లెటర్ పెట్టి 6 కోట్ల రూపాయలతో కొత్త బాక్స్ డ్రైనేజీ కట్టడం జరుగుతుంది. దాన్ని కూడా అధికారులతో మాట్లాడి సకాలంలో పూర్తయ్యే ప్రయత్నం చేస్తాను. కార్పొరేటర్ల కాల పరిమితి అయిపోతున్నప్పుడే చెప్పినం... ఎంతోమంది కార్పొరేటర్లు నిత్యం ప్రజల మధ్యలో ఉంటేనే సమస్యలు పరిష్కారం అవడం కష్టం ఉంది వారంతా దిగిపోయారు కాబట్టి మీరు స్పెషల్ ఆఫీసర్లు గంట, రెండు గంటలు గాని ఈ ప్రాంతంలో తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించాలి కానీ ఎక్కడ జరుగుతున్నట్టు కనిపించడం లేదు. మాలాంటివారు ఈ ప్రాంతాల్లో తిరిగి ఈ పనుల పర్యవేక్షణ చేసి, ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలను పై తప్పకుండా దృష్టి పెడతామని అన్నారు.

## యుద్ధంతో ప్రపంచానికి ముప్పు : బీవీ రాఘవులు

నల్లగొండ, ఏప్రిల్ 28 : యుద్ధంతో ప్రపంచ మానవాళికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ముప్పు ఉందని సిపిఐ(ఎం)పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు మంగళవారం నల్లగొండ నగరంలోని స్టే ఇన్ హోటల్ లో ఇరాన్ పై ఇజ్రాయిల్, అమెరికా యుద్ధం ప్రపంచ శాంతికి విఘాతం అనే అంశంపై టీఎస్ యూటీఎఫ్, సీఐటీయూ, పీపుల్స్ ప్రోగ్రెస్ ఫోరం నల్లగొండ ఆధ్వర్యంలో పీపుల్స్ పోగ్రెస్ ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎడ్ల సైదులు అధ్యక్షతన నిర్వహించారు. సెమినార్ ను రాఘవులు ప్రారంభించి మాట్లాడారు. ఇజ్రాయిల్, అమెరికా ఇరాన్ పై ఆక్రమిత యుద్ధం మొదలుపెట్టి 61 రోజులు పూర్తి అయ్యాయని తెలిపారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రపంచ రౌడీలాగా





వ్యవహరిస్తూ ప్రపంచ దేశాలపై ఆధిపత్య పెత్తనం సాగించాలని ఆకాంక్షతో వెనిజులా అధ్యక్షుడిని అరెస్టు చేసి నిర్బంధించారన్నారు. ఇరాన్, వెనిజులా దేశాలలో ఉన్న చమురు నిల్వలను ఆధీనంలోకి తెచ్చుకోవాలని ఆరాటంతో యుద్ధం ప్రారంభించారన్నారు. ట్రంపు చేస్తున్న యుద్ధాన్ని అమెరికా ప్రజలతో పాటు ప్రపంచం మొత్తం వ్యతిరేకిస్తుందని చెప్పారు.భారతదేశ ప్రధాని మోదీ ఆర్ఎస్ఎస్ భావజాలంతో మతోన్మాదాన్ని పెంచి పోషిస్తూ అమెరికా చెప్పుచేతల్లో కీలుబొమ్మలాగా వ్యవహరిస్తూ ట్రంప్ ఆదేశాలను పాటిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గత మూడు వేల సంవత్సరాల నుండి స్నేహ సబంధాలు ఉన్న ఇరాన్ తో పరస్పర వ్యాపార ఒప్పందాలను విరమించుకోవాలని, ట్రంప్ సూచించిన దగ్గర వ్యాపారం కొనసాగించాలని చెప్పడంతో విశ్వ గురువుగా చెప్పుకునే మోదీ విశ్వ బానిసగా మారిపోయారని అభివర్ణించారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా గ్యాస్ పెట్రోల్ డీజిల్ కొరత ఏర్పడిందని, రాబోయే కాలంలో ఎరువుల కొరత ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రపంచ రౌడీలాగా వ్యవహరిస్తున్న ట్రంప్ విధానాలతో ఆర్థిక పరిస్థితులు తారుమారు అవుతున్నాయని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. యుద్ధాల వల్ల ప్రపంచ వ్యాప్తంగా నష్టం జరుగుతుందని మొదటి, రెండవ ప్రపంచ యుద్ధ ప్రభావం నేటికీ ఉందని దానికి ప్రత్యక్ష సాక్ష్యంగా హిరోషిమా, నాగసాకి పట్టణాలు ఉన్నాయన్న విషయాన్ని మర్చిపోవద్దన్నారు. ప్రతి ఒక్కరూ యద్ధ విమోచన కోసం ఆలోచన చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ప్రస్తుతం యుద్ధాలు కాదు కావాల్సింది శాంతి అన్నారు. శాంతి కోరుకున్న ప్రతిచోట ప్రశాంతంగా జీవనం సాగుతుందన్నారు. యుద్ధం అంటే మనుషులను చంపడం, ఆస్తుల్ని ధ్వంసం చేయడమే కదా అని పేర్కొన్నారు.ఈ సెమినార్ లో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, ఆవాజ్ జిల్లా కార్యదర్శి సయ్యద్ హాషం, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ.సలీం, ఐద్వా జిల్లా కార్యదర్శి పాలడుగు ప్రభావతి, రాష్ట్ర రైతు మహిళా కన్వీనర్ కందాల ప్రమీల, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పెరమళ్ళ వెంకటేశం, రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మాల్లం మహేష్, ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ సమితి కన్వీనర్ రాములు. టిఆర్టిఎఫ్ జిల్లా కార్యదర్శి తరాల పరమేష్, దండంపల్లి సత్తయ్య, లక్కపాక రాజు, అవుట రవీందర్, పెంజర్ల సైదులు, పుచ్చకాయల నర్సిరెడ్డి, తుమ్మల పద్మ, ఖమ్మంపాటి శంకర్ పాల్గొన్నారు.

# నిర్ణయాలు... బౌన్స్ అవుతున్నాయా....



విజయవాడ, ఏప్రిల్ 28,వైఎస్ జగన్ నిర్ణయాలను ఆ పార్టీ నేతలే తప్పు పడుతున్నట్లుగానే ఉంది. ప్రధానంగా మావిగన్ తో పాటు అనేక అంశాల విషయంలో జగన్ తీసుకునే నిర్ణయాలు సహేతుకంగా లేవని పార్టీ నేతలే ఆఫ్ ది రికార్డుగా చెబుతున్నారు. మావిగన్ విషయంలో వైసీపీ కీలక నేత ఒకరు జగన్ పై చేసిన వ్యాఖ్యలను టీడీపీ సోషల్ మీడియా వైరల్ చేస్తుంది. అయితే తాను ఆ వ్యాఖ్యలను చేయలేదని నేత చెబుతున్నప్పటికీ ఎక్కువ మంది అభిప్రాయం అలాగే ఉందన్న అభిప్రాయం టీడీపీ బలంగా సోషల్ మీడియాలో వైరల్ చేస్తుంది. ఏదైనా ఒక కీలక ప్రకటన చేసే ముందు ముఖ్యమైన నేతలను, ఆ ప్రాంతనేతలతో సంప్రదించడానికి జగన్ కు ఏం ఇగో అడ్డమన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.దీని ప్రకారం చూస్తే వైసీపీ నేతలే మావిగన్ ప్రతిపాదనను వ్యతిరేకించారంటే మిగిలిన ప్రాంత నేతలు ఎందుకు వ్యతిరేకించరన్నది అర్థమవుతుంది. అయితే జగన్ లో తొలి నుంచి ఒక లోపం స్పష్టంగా కనపడుతుంది. అన్నీ ఏకపక్ష నిర్ణయాలే. తనకు తోచింది మీడియా ముందు చెబుతారు. అధికారంలో ఉన్నప్పుడు అమలు చేశారు. విపక్షంలో ఉన్నప్పుడు నిర్ణయాలను ప్రకటిస్తారు. అధికారంలో ఉన్నప్పుడు వాలంటీర్ల వ్యవస్థపై పార్టీ సీనియర్ నేతలతో పాటు అందరి నిర్ణయాలను తీసుకుంటే బాగుండేది. అలాగే ఎన్నికల సమయంలో సీట్లను మార్పు చేసినప్పుడు కూడా సీనియర్ల సలహాలు తీసుకోవచ్చు.అసలు వైసీపీకి ఒక పొలిట్ బ్యూరో ఉందో లేదో తెలియదు. ఏ విషయం కూడా జగన్ సీనియర్ నేతలతో చర్చించే అలవాటు లేదు. ఇదే ఆయన నిర్ణయాలు బూమ్ రాంగ్ అవుతున్నాయి. గతంలో మూడు రాజధానుల విషయంలోనూ, వాలంటీర్ల వ్యవస్థ విషయంలోనూ, అభ్యర్థుల ఎంపికలోనూ, చివరకు మావిగన్ వరకూ అన్నీ సొంత నిర్ణయాలేనా? ఎవరైనా ఇచ్చిన ఐడియాలా? అన్నది పక్కన పెడితే మొత్తం మీద జగన్ ఏకపక్ష నిర్ణయాలు పార్టీలో అసంతృప్తిని, అసహనాన్ని పరోక్షంగా వెళ్లగక్కు తున్నారు. ఇప్పటికైనా జగన్ గుర్తించి తగిన సలహాలు, సూచనలు సీనియర్ల నుంచి తీసుకుంటే బాగుంటుందన్న సూచనలు వెలువడుతున్నాయి.జగన్మోహన్ రెడ్డి సాధారణ సంప్రదాయ విస్తరణకు విరుద్ధంగా.. ట్రెండీ లుక్ లో కనిపించారు. జీన్ ప్యాంటు తో పాటు జీన్స్ షర్టుతో.. ఖరీదైన వాచీ తో పాటు షూస్ తో ఒక కొత్త లుక్ లో కనిపించారు జగన్మోహన్ రెడ్డి. ఆయనతో ఫోటోలు దిగేందుకు బెంగళూరు ఎయిర్ పోర్ట్ లో ప్రయాణికులు బారులు తీరారు. వారితో సెల్ఫీలు దిగారు జగన్మోహన్ రెడ్డి. జగన్ న్యూ ట్రెండీ లుక్ తో కూడిన ఫోటోలను, వీడియోలను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభిమానులు వైరల్ చేస్తున్నారు. అయితే ఈ క్రమంలో జగన్మోహన్ రెడ్డి ధరించిన షూస్ ధరపై రకరకాల ప్రచారం నడుస్తోంది.సాధారణంగా రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొన్నప్పుడు వైట్ కలర్ షర్టుతో పాటు గోధుమ రంగుతో కూడిన ఫ్యాంటును ధరిస్తుంటారు జగన్మోహన్ రెడ్డి. సాధారణంగా చెప్పులతోనే ఎక్కువగా కనిపిస్తారు. అయితే విదేశీ పర్యటనకు వెళ్ళినప్పుడు మాత్రం ట్రెండీ లుక్ తో కనిపించడం జరుగుతూ ఉంటుంది. ఈసారి కూడా ట్రెండీ లుక్ తో కూడిన కొత్త జగన్ ఆవిష్కృతమయ్యారు. అయితే ఇప్పుడు ఆయన ధరించిన షూస్ పై విస్తృత ప్రచారం సాగుతోంది. ఆయన ఇటాలియన్ లగ్జరీ బ్రాండ్ జగ్నా షూస్ ధరించారు. వాటి విలువ అక్షరాల లక్ష 85 వేల రూపాయలు అని తెలుస్తోంది. రకరకాల ట్రోల్స్ ప్రారంభం అయ్యాయి.జగన్మోహన్ రెడ్డి మొన్నటి ఎన్నికలకు ముందు చాలా ఇంటర్వ్యూ లో మాట్లాడారు. తనకు కనీసం ఫోన్ కూడా లేదని చెప్పుకొచ్చారు. తాను ఒక పేద ముఖ్యమంత్రిని అని చెప్పుకొచ్చారు. అయితే ఇప్పుడు 1 లక్ష 85 వేల రూపాయల షూస్ పై రకరకాల కామెంట్స్ వినిపిస్తున్నాయి. జగన్ హయాంలో వాలంటీర్లు మూడు సంవత్సరాలు పనిచేస్తే కానీ ఆ షూస్ వరకు అందుకోలేరని సోషల్ మీడియాలో అదే పనిగా ప్రచారం చేస్తున్నారు కొందరు. పేద సీఎం అంటూ కౌంటర్ అటాక్ చేస్తున్నారు. మరోవైపు ట్రెండీ లుక్ పై సైతం చాలా రకాలుగా ప్రచారం సాగుతోంది. సోషల్ మీడియాలో ఇప్పుడు ఇదే హాట్ టాపిక్ అవుతోంది. దీనిపై సమాధానం చెప్పలేక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సతమతం అవుతున్నాయి.

# జనసేనలో ఏం జరుగుతోంది...



విజయవాడ, ఏప్రిల్ 28, రాజకీయ నాయకుడైనా అధికారంలో ఉన్న పార్టీ నుంచి వెళ్ళిపోవడం చాలా అరుదు. కానీ జనసేన పార్టీలో లో గొంతు ఎత్తి మాట్లాడే నేతలందరూ మీద ఎన్నికల తర్వాత తీవ్ర ఆరోపణలు రావడం లేదా పార్టీ నుంచి వెళ్ళిపోవడం చూస్తుంటే నిజమే అనిపిస్తుంది. ఈ ఆరోపణలు తర్వాత వాళ్ళు పార్టీలో ఉన్న ఇంతకు ముందులా బలంగా మాట్లాడగలరా? మాట్లాడిన వారి మాటల్ని జనాలు ఎంతవరకు విశ్వసిస్తారు అనే అనుమానం వస్తుంది. పార్టీ ఆవిర్భవించిన తర్వాత అనేక మంది నేతలు పార్టీని విడిచివెళ్లిపోయారు. వారిలో ఎక్కువ మంది కాపు సామాజికవర్గానికి చెందిన వారే కావడం విశేషం.కోట వినుత, కిరణ్ రాయల్, అరవ శ్రీధర్, బొలిశెట్టి సత్యనారాయణలు ఇటీవల కాలంలో పార్టీ నుంచి బయటకు పంపారు. అయితే వీరిలో కొందరు అనవసర వివాదాల్లో చిక్కుకోవడంతో వారిని పార్టీకి దూరంగా పెట్టారు. అందులో తప్పుపట్టాల్సిన పనిలేదు. కానీ జనసేన కోసం నిలబడి పార్టీ కోసం ఒళ్లూ, ఇల్లూ హూనం చేసుకు?న్న వారిని సయితం బయటకు పంపుతుండటం జనసేనలో చర్చనీయాంశమైంది. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత జనసేనను వీడే నేతలు ఎక్కువగా ఉంటారని ఆ పార్టీ నేతలే సోషల్ మీడియాలో బహిరంగంగా చెబుతున్నారంటే నాయకత్వం కొంత ఆలోచన చేసుకోవాల్సిన అవసరం ఉంది.నియోజకవర్గాల్లో జనసేన కార్యకర్తలతో పాటు నేతలు కూడా సంతృప్తి కరంగా లేరు. అందుకే పవన్ కల్యాణ్ పై విమర్శలు ఎవరు చేసినా పెద్దగా స్పందన రావడం లేదు. అధికారంలో ఉన్నప్పటికీ పనులు అవ్వటం లేదన్న అసంతృప్తి పార్టీ ఎమ్మెల్యేల్లో, నాయకులలో కూడా ఉంది. కిందస్థాయిలో చిన్న చిన్న పనులు కూడా చేయించుకో లేకపోతుండటం వారిని బాధిస్తుంది. జెండా మోసిన తమకు కలిగే ప్రయోజనం ఏంటన్నది వారిలో కలుగుతుంది. అయితే ఇదంతా ఒక పద్ధతి ప్రకారం జరుగుతుందా అనే అనుమానం నాయకత్వంలోనూ కలుగుతుంది. జనసేనను కాపాడుకోవాల్సిన బాధ్యత పవన్ కల్యాణ్ తో పాటు రాష్ట్ర నాయకత్వంపై ఉంది. లేకుంటే రాజకీయ ఇబ్బందులు తప్పవు.

# నారా లోకేశ్ కు పెద్ద సవాల్

గుంటూరు, ఏప్రిల్ 28, తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి నారా లోకేశ్ కు పెద్ద సవాల్ అని చెప్పాలి. ఇప్పటి వరకూ చంద్రబాబు ఇమేజ్ పైనే పార్టీ ఇన్నాళ్లు గెలుస్తూ వచ్చింది. నాలుగు సార్లు అధికారంలోకి వచ్చింది. అయితే రానున్న కాలంలో లోకేశ్ నాయకత్వంలోనే ఎన్నికలకు వెళ్లనున్నారన్నది అందరికీ తెలిసిన విషయమే. టీడీపీ ఇప్పటికే లోకేశ్ చేతుల్లోకి వెళ్లిపోయింది. 2029 ఎన్నికలు లోకేశ్ నాయకత్వంలోనే జరగనున్నాయి. అభ్యర్థుల ఎంపిక నుంచి మ్యానిఫేస్టో రూపకల్పన వరకూ ఆయనే అన్నింటికీ పర్యవేక్షణ వహిస్తారు. లోకేశ్ పార్టీ క్యాడర్ విశ్వాసాన్ని బలంగా పొందగలిగారు.అయితే ప్రజల నమ్మకాన్ని పొందాల్సి ఉంటుంది. చంద్రబాబు ఇమేజ్ తో, అనుభవంతో పోల్చుకుంటే లోకేశ్ కు ఇప్పట్లో సాధ్యం కాదు. ఒకరకంగా లోకేశ్ విపక్ష నాయకుడు జగన్ కంటే తక్కువ రాజకీయ అనుభవం ఉన్న వారి కిందే జనం చూస్తారు. పార్టీని నడపగలగడం అంత ఆషామాషీ కాదు. గెలిస్తే పూలదండలు..ఓడితే అవే చేతులు రాళ్లు వేస్తాయన్నది లోకేశ్ మర్చి పోకూడదు. చంద్రబాబు నాయుడు పార్టీ పగ్గాలు చేపట్టే నాటికీ, లోకేష్ బాధ్యతలు స్వీకరిస్తున్న సమయానికి చాలా తేడా ఉంది. ఒకరకంగా చెప్పాలంటే సంబంధమే లేదు. చంద్రబాబు గద్దెనెక్కే సమయంలో కూడా ఎన్టీఆర్‌ను బలవంతంగానే గద్దె దించవలసి వచ్చింది. శాసనసభ్యులు తీసుకున్న ఆ నిర్ణయాన్ని పార్టీ శ్రేణులు ఆహ్వానించటం చంద్రబాబు సాధించిన విజయాల్లోకే ఘనవిజయం. పార్టీ శ్రేణులు కూడా చంద్రబాబును ఆహ్వానించి నాయకత్వ మార్పిడిని, బాబు నాయకత్వాన్ని ఆమోదించాయి.ప్రస్తుతం లోకేశ్ నాయకత్వ బాధ్యతలను స్వీకరించే సమయానికి చంద్రబాబు పూర్తిగా ఫిట్ గా, ఆరోగ్యంగా ఉన్నారు. పవన్ కల్యాణ్ కూడా మరో పదిహేనేళ్లు అనుభవమున్న చంద్రబాబు నాయకత్వమే రాష్ట్రానికి అవసరమని పదేపదే చెబుతున్నారు. మరొకవైపు జగన్ పాలనలోని లోపాలు కలసి వస్తాయని భావించినా అవి ఎంత వరకూ అనేది ఇప్పుడే చెప్పలేం. అటువంటి పరిస్థితుల్లో టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంటుగా బాధ్యతలు స్వీకరిస్తున్నాడు లోకేశ్. బాధ్యతను తీసుకుంటున్న సమయానికి చుట్టూ ఎటు చూసినా ఆహ్లాదంగానే కనిపిస్తున్నది. ?కానీ ఇప్పుడు నడుస్తున్నది చాలా సంక్లిష్ట రాజకీయం. దీనిని లోకేశ్ ఎలా అధిగమిస్తారోనన్నది చూడాలి.నారా లోకేష్ విశాఖ విమానాశ్రయంలోప్రత్యక్షం అయ్యారు. చింతకాయల విజయ్ ఆధ్వర్యంలో టిడిపి శ్రేణులు భారీగా తరలి వచ్చాయి విమానాశ్రయానికి. పెద్ద ఎత్తున స్వాగతం పలికాయి. అసలు లోకేష్ ఎక్కడికి వెళ్లారు? అనే చిక్కుముడి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి వీడలేదు. లోకేష్ వెళ్ళింది వ్యక్తిగత పర్యటన నిమిత్తం. దానిని కూడా తట్టుకోలేకపోతోంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. ఈ గోప్యత వెనుక ఉన్న కారణం ఏంటి అనేది ఆ పార్టీకి అంతుపట్టడం లేదు. దీనికి తోడు విశాఖ విమానాశ్రయంలో లోకేష్ స్వాగతం చూస్తుంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మైండ్ బ్లాక్ అవుతోంది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఈ రకమైన ఆందోళన కోసమే లోకేష్ పర్యటనను గోప్యంగా ఉంచినట్లు అర్థం అవుతోంది. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన జరగనుంది. లోకేష్ ప్రత్యేక చొరవతోనే ఈ డేటా సెంటర్ విశాఖకు వచ్చింది. కేంద్ర ప్రభుత్వంతో ఎప్పటికప్పుడు ప్రత్యుత్తరాలు జరుపుతూ.. పట్టు గూగుల్ సంస్థతో ప్రభుత్వం తరుపున చర్చిస్తూ.. ఒప్పించడంలో లోకేష్ పాత్ర ఉంది. ఈనెల 18 నుంచి కనిపించకుండా పోయిన లోకేష్ ఈరోజు విశాఖ ఎయిర్పోర్ట్లో ప్రత్యక్షం అయ్యారు.

# విశాఖలో భారీ త్రిశూలం...


విశాఖపట్టణం, ఏప్రిల్ 28,సిటీ అఫ్ డెస్టీనీ' గా పేరుపడ్డ విశాఖలో ఈ మధ్య కాలంలో చాలా టూరిజం ఎట్రాక్షన్స్ వచ్చాయి. వాటి జతకి కొత్తగా కైలాసగిరి పై భారీ త్రిశూలాన్ని ఏర్పాటు చేసింది వైజాగ్ మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్మెంట్ అథారిటీ. కైలాస గిరి కొండపై ఏర్పాటు చేసిన 65 అడుగుల పొడవైన త్రిశూలాన్ని వైజాగ్ లోని ముఖ్య ప్రాంతాల నుండి చూస్తే కనపడేలా ప్లాన్ చేశారు. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తయిన ఈ భారీ త్రిశూలాన్ని ఈ వారంలోనే అధికారికంగా ప్రారంభించేందుకు ప్లాన్ చేస్తున్నట్టు వీఎంఆర్డీఏ చైర్మన్ ఓఎ ప్రణవ్ గోపాల్ తెలిపారు.వైజాగ్ లో కైలాసగిరి అంటే వెంటనే గుర్తు వచ్చేది ఆ కొండపై ఏర్పాటు చేసిన శివ పార్వతుల విగ్రహాలు. వాటికి తోడుగా ఒక త్రిశూలాన్ని ఏర్పాటు చేయాలని ఈ మధ్య సంకల్పించింది. దానికోసం 2.50 కోట్లు బడ్జెట్ కేటాయించి రకరకాల డిజైన్లు పరిశీలించారు. చివరకు సెలక్ట్ అయిన డిజైన్ తో కైలాసగిరి కొండకు మరోవైపున ఈ త్రిశూలాన్ని ఏర్పాటు చేశారు. టూరిజం ప్లస్ ఆధ్యాత్మికం రెండూ ఉట్టిపడే 65 అడుగుల ఎత్తుతో ఉండే భారీ త్రిశూలం పగటిపూట విశాఖపట్నంలోని ముఖ్య ప్రాంతాల నుంచి కైలాసగిరి వైపు చూస్తే కనబడుతుంది.ప్రత్యేకంగా రాత్రి వేళల్లో ఈ త్రిశూలం మరింత అందంగా కనపడేలా 110 వాట్ల శక్తివంతమైన ఎల్ఈడి బల్బులను అమర్చారు. మోడరన్ టెక్నాలజీ తో ట్రాన్స్ లూసెంట్ ఫైబర్ రీన్ఫోర్స్డ్ ప్లాస్టిక్ తో నిర్మించడం వల్ల ఈ త్రిశూలం సహజంగా వైజాగ్ తీరంలో వచ్చే తుఫాన్లను బలమైన గాలులను కూడా తట్టుకునే సామర్థ్యం కలిగి ఉంటుందని చైర్మన్ ప్రణవ్ తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా కైలాసగిరిలో పర్యాటకుల సంఖ్య మరింతగా పెరుగుతుందని టూరిస్టులకు కొత్తరకం అనుభూతిని ఇవ్వడమే తమ లక్ష్యం అని అధికారులు చెబుతున్నారు. నిజానికి ఈ ఆదివారం నాడే దీన్ని ప్రారంభించాల్సి ఉన్నా కొన్ని అనుకోని కారణాల వల్ల "త్రిశూల్" అధికారికంగా ప్రారంభం రావడానికి మరొక వారం పడుతుందని అధికారులు అంటున్నారు.వైజాగ్ లో బీచ్ ఎంత ఫేమస్సో కైలాసగిరి కొండ కూడా అంతే ఫేమస్. ప్రతి ఏటా కనీసం మూడు లక్షల మంది టూరిస్టులు కైలాసగిరి కొండను విజిట్ చేస్తూ ఉంటారు. వీరిలో ఇండియన్స్ తో పాటు ఫారినర్స్ కూడా ఉంటారు. కైలాసగిరి నుండి విశాఖలోని సముద్ర తీరాన్ని చూడడం ఒక మరుపురాని అనుభూతిగా పర్యాటకులు చెబుతూ ఉంటారు. అందుకే 2003లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కైలాస గిరిని "బెస్ట్ టూరిస్ట్ స్పాట్ " గా ఎంపిక చేసింది. ఈ కొండ విశాఖపట్నం రైల్వే స్టేషన్ నుంచి పది కిలోమీటర్ల దూరంలోనూ, ద్వారకా బస్ స్టేషన్ నుండి ఐదు కిలోమీటర్ల దూరంలోనూ దూరం లోనూ ఉంటుంది. ఆ రెండు చోట్ల నుంచి డైరెక్ట్ బస్సులు ఉంటాయి.కైలాసగిరి కొండపై ఉన్న శివపార్వతుల విగ్రహాలకు తోడు 350మీ పొడవుండే కేబుల్ కార్ కూడా చాలా ప్రసిద్ధమైనది. ఈమధ్య ఏర్పాటు చేసిన గ్లాస్ బ్రిడ్జ్ కూడా చాలా పాపులర్ అయింది. వీటికి తోడు ఇప్పుడు ఈ భారీ త్రిశూలం కూడా కైలాసగిరి పై స్పెషల్ ఎట్రాక్షన్ గా మారనుంది. అన్నట్టు ఈ త్రిశూలం వద్ద ఎలాంటి ఫీజు వసూలు చేయబోవడం లేదు. పూర్తిగా ఉచితమని అధికారులు చెబుతున్నారు. దానితో వీకెండ్ లోనూ హాలిడేస్ లోనూ ఫ్యామిలీతో సరదాగా వెళ్లడానికి అనువుగా ఉండే కైలాసగిరి పై ఈ "త్రిశూల్" వల్ల మరొక కొత్త ఆకర్షణ వచ్చినట్టే అయిందని అంటున్నారు వైజాగ్ వాసులు

# వివాదం అవుతున్న స్టాండప్ కామెడీ

తిరుపతి ఏప్రిల్ 28, ఇటీవల స్టాండప్ కామెడీవివాదాస్పదం అవుతోంది. మొన్న మధ్యన స్టాండప్ కమెడియన్ ఒకరు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పై అనుచిత వ్యాఖ్యలు చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆయన అరెస్ట్ కూడా జరిగింది. ఆ ఘటన మరువకముందే.. అటువంటి ఘటనే ఒకటి చోటుచేసుకుంది. టిడిపి అధినేత చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ తెలుగుదేశం మద్దతుదారులు హైదరాబాద్ కు చెందిన స్టాండప్ కమెడియన్ శరత్ ఉదయ్ కామెడీ షో ను అడ్డుకున్నారు. రెండేళ్ల కిందట చంద్రబాబుపై శరత్ ఉదయ్ చేసిన కామెడీ అభిమానుల్లో ఆగ్రహం నింపింది. ఇప్పుడు అదే శరత్ ఉదయ్ కామెడీ షో ను టిడిపి నేతలు అడ్డుకోవడం కూడా సంచలనంగా మారింది.చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 2003లో నక్సలైట్లు దాడి చేసిన సంగతి తెలిసిందే. తిరుమలలో శ్రీవారిని దర్శించుకునేందుకు గాను వెళ్తున్న చంద్రబాబు వాహనంపై బాంబుతో దాడి చేశారు. క్లైమరా మైన్స్ పెట్టి వాహనాన్ని తేల్చే ప్రయత్నం చేశారు. బుల్లెట్ ప్రూఫ్ వాహనం కావడంతో గాయాలతో బయటపడ్డారు చంద్రబాబు నాడు. అయితే స్టాండప్ కామెడీలో భాగంగా? రెండేళ్ల కిందట నక్సలైట్ల దాడిని ప్రస్తావిస్తూ శరత్ ఉదయ్ జోక్ చేశాడు. దీనిపై అప్పట్లోనే తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి డిమాండ్ మేరకు దానిపై అప్పట్లోనే శరత్ ఉదయ్ క్షమాపణలు చెప్పాడు. దీంతో అంతటితో ఆ వివాదం ముగిసిపోయిందని అంతా భావించారు.మరోసారి క్షమాపణ చెప్పించిన వైనం బెంగళూరులోని కోరమంగళ లో శనివారం రాత్రి 7 గంటల సమయంలో శరత్ ఉదయ్ స్టాండప్ కామెడీ షో ప్రారంభం అయింది. ఈ క్రమంలో ప్రేక్షకుల నుంచి ఓ వ్యక్తి శరత్వతయు వద్దకు చేరుకున్నాడు. తాను మీ అభిమాని నంటూ పరిచయం చేసుకున్నాడు. మీరు బాగా కామెడీ చేస్తారని.. అయితే ఒక షోలో తమ నాయకుడిని అవమానించారని అన్నారు. ఆ వెంటనే మరో ఇద్దరు వ్యక్తులు అతనితో చేరారు. శరత్ ఉదయ్ ను బెదిరించడం ప్రారంభించారు. ఆ తర్వాత వారితో మరికొంతమంది చేరారు. అయితే అప్పట్లోనే తాను క్షమాపణలను కోరినట్లు శరత్ ఉదయ్ చెప్పారు. అయినా సరే వారు వినలేదు. చంద్రబాబుతో పాటు లోకేష్ కు ఆయనతో క్షమాపణలు చెప్పించారు. చంద్రబాబు నాయుడు గారికి, నారా లోకేష్ గారికి క్షమాపణలు చెబుతున్నాను. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను కూడా క్షమాపణ కోరుతున్నానని' వీడియో రికార్డింగ్‌లో శరత్ ఉదయ్ మరోసారి సారీ చెప్పారు. అంతటితో ఆగకుండా జై తెలుగుదేశం, జై చంద్రబాబు అనాలని అతడిపై టీడీపీ కార్యకర్తలు ఒత్తిడి పెంచారు. చేసిన వ్యాఖ్యలపై తప్పిదానికి క్షమాపణ చెబుతా కానీ, మీ పార్టీకి, నేతకు జై కొట్టాలని ఎలా అడుగుతారని.. తాను వైసీపీ నేతలపై సైతం జోక్స్ వేశానని శరత్ ఉదయ్ గుర్తుచేశాడు. మరోసారి జాగ్రత్తగా మాట్లాడాలని అతడికి వార్నింగ్ ఇచ్చి అక్కడినుంచి వెళ్లిపోయారు. సారీ చెప్పాను కదా.. ఇక నా షో నుంచి వెళ్లిపోండి అని టీడీపీ మద్దతుదారులకు అతడు సూచించగా.. టికెట్ డబ్బులు తిరిగిస్తావా అని వాళ్లు అడిగారు.

# విజయ్ సాయిరెడ్డి టార్గెట్ ఎవరు...

నెల్లూరు, ఏప్రిల్ 28, అసలు విజయసాయిరెడ్డి లక్ష్యం ఏంటి? ఆయన రాజకీయ పార్టీ ఎందుకు పెడుతున్నారు? మీడియా ఛానల్ ఏర్పాటు వెనుక ఉన్న అసలు కారణం ఏంటి? పొలిటికల్ సర్కిల్లో ఇదే ప్రచారం నడుస్తోంది. ఇప్పటివరకు పార్టీలు ప్రకటించిన వారంతా చరిష్మ ఉన్నవారు. కానీ విజయసాయిరెడ్డి విషయానికి వచ్చేసరికి ఆయన కేవలం జగన్మోహన్ రెడ్డి వెనుక పని చేశారే తప్ప.. ఆయనకంటూ ఒక సొంత ఇమేజ్ లేదు. పైగా వివాదాస్పద ముద్ర ఉంది. కానీ రాజకీయ పార్టీ ఏర్పాటు వెనుక అసలు వ్యూహం ఏంటనేది తెలియడం లేదు. పైగా మీడియా ఛానల్ ఏర్పాటుకు సమాంతరంగా రాజకీయాలు చేస్తామనడం మాత్రం ఏదో ఒక లక్ష్యంతో అన్నట్టు కనిపిస్తోంది. కచ్చితంగా ఎవరినో ఒకరిని టార్గెట్ చేసి ఈ చర్యకు దిగినట్లు అర్థమవుతోంది.ఒకవేళ జగన్ మోహన్ రెడ్డి వెనుక ఉండి ఇలా చేయిస్తారు అనుకోవడం ఎంత మాత్రం సహేతుకం కాదు. ఎందుకంటే జగన్మోహన్ రెడ్డికి మీడియా ఉంది. ఆయన పార్టీ ప్రతిపక్షంలో ఉంది. ఈ సమయంలో విజయసాయిరెడ్డి పార్టీ పెడితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఇబ్బంది కరం. పైగా రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి. ఆపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో నెంబర్ 2 గా ఎదిగిన నాయకుడు. ఆయన పార్టీ పెడితే తప్పకుండా ఆ ప్రభావం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై ఉంటుంది. పైగా విజయసాయిరెడ్డి తో జగన్మోహన్ రెడ్డి పార్టీ పెట్టిస్తే అది అంతిమంగా వైసీపీకి నష్టం. ఇప్పటికే వైసీపీకి సాక్షి మీడియాతో పాటు అనుకూల మీడియా చాలా వరకు ఉంది. కొత్తగా విజయసాయిరెడ్డితో మీడియాను ఏర్పాటు చేసే అవసరం జగన్మోహన్ రెడ్డికి ఎంత మాత్రం లేదు.పోనీ చంద్రబాబు ఇలా చేయిస్తున్నారు అంటే మాత్రం కొంతవరకు నమ్మవచ్చు. ఎందుకంటే చంద్రబాబుతో సాయి రెడ్డికి బంధుత్వం ఉంది. నందమూరి తారకరత్న భార్యకు విజయసాయిరెడ్డి స్వయానా చిన్నాన్న అవుతారు. అప్పట్లో తారకరత్న చనిపోయే సమయంలో విజయసాయిరెడ్డి అన్ని తానై వ్యవహరించారు. అటు చంద్రబాబుతో పాటు నందమూరి బాలకృష్ణ సైతం విజయసాయిరెడ్డి తో ప్రత్యేకంగా గడపాల్సి వచ్చింది. అటు తరువాతనే జగన్మోహన్ రెడ్డితో విజయసాయి రెడ్డికి ఒకలాంటి గ్యాప్ ఏర్పడింది. పార్టీకి దూరమైన క్రమంలో విజయసాయిరెడ్డి పై జగన్మోహన్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు కూడా చేశారు. ఇవన్నీ చంద్రబాబుతో విజయసాయిరెడ్డి దగ్గర కావడం వల్ల జరిగిన పని అంటూ అనుమానాలు ఉన్నాయి. అందుకే చంద్రబాబు విజయసాయిరెడ్డి తో ఈ పని చేయించి ఉంటారన్న అనుమానాలకు ఎంతో కొంత బలం చేకూరుస్తోంది.అయితే ఏకకాలంలో మీడియా ఏర్పాటుతో పాటు కొత్త రాజకీయ పార్టీ ప్రకటన చేశారు విజయసాయిరెడ్డి. అయితే గెలుపు ఓటములను పక్కన పెడితే విజయసాయిరెడ్డి ఎవరినో విపరీతంగా టార్గెట్ చేసుకున్నట్టు కనిపిస్తున్నారు. జగన్మోహన్ రెడ్డి కోసం ఎంత చేయాలో అంత చేశారు విజయసాయిరెడ్డి. 16 నెలల జైలు జీవితాన్ని గడిపారు జగన్మోహన్ రెడ్డి తో కలిసి. వైసీపీ నే అధికారంలోకి తెచ్చేందుకు సర్వశక్తులు వడ్డారు. గౌరవభావం సంపాదించుకున్నారు. పదవులు అనుభవించారు. కానీ ఇవన్నీ నాణానికి ఒకవైపే. జగన్మోహన్ రెడ్డి వల్ల గౌరవ భావాన్ని కోల్పోయారు. కేసులను ఎదుర్కొన్నారు. అవమానాలు కూడా పడ్డారు. అయితే తన ఈ పతనానికి జగన్మోహన్ రెడ్డి కారణం అన్నది విజయసాయిరెడ్డి ఆలోచనగా తెలుస్తోంది. అందుకే ఆయనను టార్గెట్ చేసుకుని మీడియాతో పాటు కొత్త పార్టీ ఏర్పాటు అన్నది ఒక అనుమానం. దీనిలో ఎంత నిజం ఉందో తెలియాలి.



## జర్నలిస్టు హత్యపై సిపిఐ ఖండన--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 28–చిత్తూరు జిల్లా వి.కోటలో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి విలేఖరి జగన్మోహన్ రెడ్డి హత్యను సిపిఐ నంద్యాల జిల్లా సమితి తీవ్రంగా ఖండించింది. ఉదయం వాకింగ్‌కు వెళ్లిన సమయంలో దుండగులు కత్తులతో దాడి చేసి హత్య చేయడం దారుణమని జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు, సహాయ కార్యదర్శి ఎస్. బాబా ఫక్రుద్దీన్ తెలిపారు.జర్నలిస్టులపై దాడులు పత్రికా స్వేచ్ఛపై దెబ్బ అని పేర్కొంటూ, ఈ ఘటనలో ప్రధాన నిందితులతో పాటు సంబంధిత వారందరిని తక్షణమే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని, జర్నలిస్టులకు భద్రత కల్పించడంలో ప్రభుత్వం, పోలీసులు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

## అన్న క్యాంటీన్లపై కమిషనర్ దృష్టి--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 28–మున్సిపల్ పరిధిలో పేద ప్రజలకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాల్సిన బాధ్యతను అధికారులు ఖచ్చితంగా నిర్వర్తించాలని మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న స్పష్టం చేశారు. మంగళవారం ఆయన అన్న క్యాంటీన్లను ఆకస్మికంగా తనిఖీ చేసి, ఆహారం నాణ్యత, మెనూ అమలు, పరిశుభ్రత, సేవల వేగం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించారు.క్యాంటీన్లలో అందిస్తున్న భోజనం నిర్ణయించిన మెనూ ప్రకారమే ఉండాలని, ఎలాంటి లోపాలు ఉన్నా వెంటనే సరిదిద్దాలని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు. పేదలకు తక్కువ ధరకే పోషకాహారం అందించడం ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని, అందులో నిర్లక్ష్యం అస్సలు సహించబోమని హెచ్చరించారు. పరిశుభ్రత ప్రమాణాలు కచ్చితంగా పాటిస్తూ, వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని సూచించారు.ఈ తనిఖీ కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్లు విక్రమ్, శభరిష్, శానిటేషన్ సూపర్వైజర్లు లక్ష్మీనారాయణ, శివప్రసాద్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నృసింహ స్వామి ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం---

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 28: తెలుగు పేటలోని శ్రీ ఘణ మద్దులేటి లక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానంలో 28వ వార్షికోత్సవ మహోత్సవాలు ఏప్రిల్ 29 నుంచి మే 1 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.ఏప్రిల్ 29న స్వామి, అమ్మవార్లకు కలశాభిషేకం, పంచామృతాభిషేకం, స్వప్న తిరుమంజనం నిర్వహిస్తారు.



ఏప్రిల్ 30న నృసింహ జయంతి సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారి కళ్యాణం మహోత్సవం, సాయంత్రం గ్రామోత్సవం జరుగుతాయి. మే 1న స్వాతి నక్షత్రం సందర్భంగా సుదర్శన హోమం, అమ్మవార్లకు సామూహిక ఒడి బియ్యం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మూడు రోజుల కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆలయ అధికారులు కోరారు.

### పీడీకి వినతి.-- ఉపాధి పనులు ప్రారంభించాలి--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 28–కొలిమిగుండ్ల మండలంలోని చింతలాయపల్లి పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పనులు నిలిచిపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపిస్తూ వ్యవసాయ కార్మిక, రైతు సంఘాల నాయకులు మంగళవారం జిల్లా పీడీ సూర్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. చింతలాయపల్లి, మదనంతపురం, ఎస్.చెన్నంపల్లి, రాఘవరాజుపల్లి గ్రామాల్లో సుమారు 400 మందికి పైగా కూలీలు పనులు లేక ఆర్థికంగా కష్టాలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వేసవి కాలం సగం గడిచినా పనులు ప్రారంభించకపోవడం అధికారుల నిర్లక్ష్యమని విమర్శించారు. చట్టం ప్రకారం పని దినాలు కల్పించాల్సి ఉన్నప్పటికీ అమలు జరగడంలేదని, మహిళా కూలీలు ఉపాధి లేక ఇళ్లకే పరిమితమయ్యారని పేర్కొన్నారు.

# స్వచ్ఛ సర్వేక్షన్‌లో టాప్ లక్ష్యం--

### నిర్లక్ష్యానికి నో-- కమిషనర్ శేషన్న--



పట్టణాన్ని స్వచ్ఛంగా, శుభ్రంగా నిలుపుకోవడంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న స్పష్టం చేశారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బందితో స్వచ్ఛ సర్వేక్షన్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షన్ ర్యాంకింగ్‌లో మెరుగైన స్థానం సాధించేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పట్టణంలోని ప్రధాన రహదారులు, కాలనీలు, ప్రజా ప్రదేశాలలో పరిశుభ్రతను కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించారు. చెత్త సేకరణ ప్రతిరోజూ సమయానికి జరిగేలా పర్యవేక్షణ పెంచాలని, ఎక్కడైనా చెత్త పేరుకుపోతే వెంటనే చర్యలు తీసుకోవాలని చెప్పారు.ఇళ్ల నుంచి చెత్త వేర్వేరుగా సేకరించడం, డ్రై-వెట్ వ్యర్థాల వర్గీకరణపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. సచివాలయ సిబ్బంది తమ పరిధిలోని ప్రాంతాలను నిత్యం పర్యవేక్షిస్తూ పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు.పనుల్లో అలసత్వం చూపే సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. పట్టణంలో పరిశుభ్రతలో ప్రజల భాగస్వామ్యం కూడా కీలకమని, అందరూ కలిసికట్టుగా పనిచేస్తేనే స్వచ్ఛ సర్వేక్షన్‌లో మంచి ఫలితాలు సాధించగలమని తెలిపారు.ఈ సమావేశంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రత్తి విత్తన కేంద్రాలపై ఆకస్మిక తనిఖీలు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 28: వ్యవసాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు మండలంలోని ప్రత్తి విత్తన శుద్ధి కేంద్రాలపై రెండు రోజుల పాటు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కమిషనరేట్ నుంచి



సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకటేశ్వర్లు, వ్యవసాయ అధికారి లక్ష్మిరెడ్డి, మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా విత్తన శుద్ధి కేంద్రాల్లో రికార్డులు, పత్తి నిల్వలు, ప్రాసెసింగ్ విధానాన్ని పరిశీలించి హెచ్‌టీ పరీక్షలు నిర్వహించగా నెగెటివ్‌గా తేలింది. కేంద్రాల యజమానులు తప్పనిసరిగా అన్ని రిజిస్టర్లు నిర్వహించాలని అధికారులు సూచించారు.అలాగే రిటైల్ దుకాణాలు, ట్రాన్స్పోర్ట్ ఏజెన్సీలను తనిఖీ చేసి విత్తన విక్రయాలపై ఆరా తీశారు. అనుమతి పొందిన కంపెనీల విత్తనాలనే విక్రయించాలి, రైతులకు రశీదులు ఇవ్వాలి, స్టాక్ రిజిస్టర్‌ను ప్రతిరోజూ నవీకరించాలి, ధరల పట్టికను ప్రదర్శించాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే విత్తన చట్టం 1966, విత్తన నియంత్రణ క్రమం 1983 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## సంక్షేమ వసతి గృహాలను "నెట్ జీరో ఒ హెల్తీ క్యాంపస్"లుగా అభివృద్ధి చేయడం లక్ష్యం

### జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి

కర్నూలు, ఏప్రిల్, 28:జిల్లాలోని అన్ని సంక్షేమ రెసిడెన్షియల్ వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలు మరియు హాస్టళ్లను "నెట్ జీరో ఒ హెల్తీ క్యాంపస్ 'లుగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపడుతోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పేర్కొన్నారు.మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూల్స్ హాస్టళ్లలో నెట్ జీరో మరియు హెల్తీ క్యాంపస్ లుగా రూపొందించే అంశంపై సంక్షేమ శాఖలు, విద్యుత్, నెడ్ క్యాప్ తదితర శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... వసతి గృహాలను ప్రభుత్వం నెట్ జీరో ఒ హెల్తీ క్యాంపస్ లుగా తీర్చిదిద్దడం లో భాగంగా నెట్ జీరో ఎనర్జీ, పచ్చదనం పెంపు, నీటి సంరక్షణ, కార్బన్ ఉద్గారాల తగ్గింపు లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మొదటి దశలో రెసిడెన్షియల్ స్కూల్స్, తదుపరి దశలో సంక్షేమ వసతి గృహాలలో ఈ ప్రక్రియ అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నెట్ జీరో ఎనర్జీ ఏర్పాటు లో భాగంగా సంబంధిత హాస్టల్స్ విద్యుత్ వినియోగాన్ని అంచనా వేసి, తదనుగుణంగా సౌర రూఫ్‌టాప్‌లను ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ మరియు నెట్ క్యాప్ అధికారులను ఆదేశించారు. వసతి గృహంలో వంటగది వ్యర్థాల నిర్వహణ లో భాగంగా వెజిటబుల్ డీకంపోజింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని, తడి మరియు పొడి/రీసైకిల్ వ్యర్థాల వర్గీకరణ వ్యవస్థను అమలు చేసి సమర్థవంతమైన రీసైక్లింగ్‌ను సాధించాలని కలెక్టర్ ఆదేశించారు. వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసి భూగర్భ జలాలను పెంచాలని, సోక్ పిట్స్ ద్వారా ఉపయోగించిన నీటిని తిరిగి వినియోగించే చర్యలు చేపట్టాలన్నారు. హాస్టళ్లలో మొక్కలు నాటి పచ్చదనం పెంచాలని, కిచెన్ గార్డెన్ లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. డి ఆర్ డి ఎ, డ్వామా శాఖల అధికారులు ఇందుకోసం తగిన సహకారం అందించాలన్నారు. సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి, సంక్షేమ విద్యాసంస్థలను పర్యావరణహిత మరియు ఆరోగ్యకర క్యాంపస్‌లుగా అభివృద్ధి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.హాస్టల్ విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలిఅరికేర వసతి గృహాల్లో ఇటీవల జరిగిన సంఘటనను దృష్టిలో ఉంచుకుని, విద్యార్థులను క్రమశిక్షణతో నడిపించడం అత్యంత అవసరమని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండేలా ప్రత్యేక పర్యవేక్షణతో పాటు, , కౌన్సిలింగ్ ఇవ్వాలని సూచించారు. వసతి గృహాల్లో పనిచేస్తున్న సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి, విద్యార్థుల భద్రత, ఆరోగ్యం మరియు ప్రవర్తనపై క్రమం తప్పకుండా నిఘా ఉంచాలని ఆదేశించారు. అదేవిధంగా, వసతి గృహాల్లోని టాయిలెట్ల మరమ్మత్తులను జూన్ 15 నాటికి పూర్తి చేయాలన్నారు. విద్యార్థులకు నిర్ణయించిన మెనూ ప్రకారం నాణ్యమైన మరియు పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలని సంక్షేమ శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి రాధిక, జిల్లా బీసీ వెల్ఫేర్‌అధికారి ప్రసూన,డ్వా మా పిడి నరసింహారెడ్డి, డి.ఆర్.డి.ఎ పిడి రమణారెడ్డి, డిపివో భాస్కర్, నెట్ క్యాప్ అధికారి వీరేంద్ర, రెసిడెన్షియల్ స్కూల్స్ కో ఆర్డినేటర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఆకస్మిక ప్రమాదాల పై తీసుకునే చర్యలు పటిష్టంగా ఉండాలి

### మాక్ డ్రిల్ ను సక్రమంగా ప్రమాణాలతో నిర్వహించాలి

### రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్మెంట్ ఎండి ప్రఖర్ జైన్

కర్నూలు, ఏప్రిల్ 28: – ఈ నెల 30 వ తేదీన అన్ని జిల్లాలలో నిర్వహించనున్న మాక్ డ్రిల్ ను సక్రమంగా ప్రమాణాలతో నిర్వహించాలి అని ఆకస్మిక ప్రమాదాల పై తీసుకునే చర్యలు పటిష్టంగా ఉండాలి అని జిల్లా అధికారుల ను రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్మెంట్ ఎండి ప్రఖర్ జైన్ ఆదేశించారు.మంగళవారం ఉదయం విజయవాడ నుండి రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్మెంట్ ఎండి ప్రఖర్ జైన్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో ఈ నెల 30 వ తేదీన రాష్ట్రమంతటా నిర్వహించనున్న మాక్ ఎక్సర్సైజ్ పై , ఏర్పాట్ల పై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎండి మాట్లాడుతూ... ప్రమాదం జరిగిన వెంటనే సంబంధిత అధికారులకు అందరికీ సమాచారాన్ని వేగంగా అందజేయాలని,ప్రమాదాన్ని ఎదుర్కోవడానికి అన్ని విధాల అన్ని వసతులు సమకూర్చుకొని చర్యలు చేపట్టాలని కోరారు. ఆయిల్ మరియు కెమికల్ ప్రమాదాలు జరిగినప్పుడు ప్రమాదం తీవ్రతను అంచనా వేయగలగాలి , ప్రమాదం జరిగిన ప్రదేశంలో కావలసిన పరికరాలు , దుస్తులు , మంటలను ఆర్పుటకు నీరు – ఫోమ్, అగ్నిమాపక యంత్రాలు అంబులెన్సులు, స్ట్రెచర్లు, అనుభవం కలిగినడాక్టర్లు , మందులు అన్నీ ఉండేలాగా గాయపడ్డ వారిని అక్కడే వైద్యం చేయటానికి షెల్టర్ మరియు ఆసుపత్రులకు తరలించడానికి సౌకర్యాలు కల్పించాలని , ప్రమాద తీవ్రతను అంచనా వేసే విధంగా జిఐఎస్ మ్యాప్,సైట్ మ్యాప్ లు ఉంచుకోవాలని కోరారు.

## అబ్బిపురంలో కాలువ పునరుద్ధరణ--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 28–నంద్యాల జిల్లా, మహానంది మండలం అబ్బిపురం గ్రామంలో "జలధార?జలహారతి" కార్యక్రమం కింద ఉప కాలువ పునరుద్ధరణ పనులు ప్రారంభమయ్యాయి. సంవత్సరాలుగా నిర్లక్ష్యానికి గురైన కాలువను పునరుద్ధరించాలని రైతులు చేసిన విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకుని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పరిపాలనా అనుమతి మంజూరు చేశారు.రూ.2.31 లక్షల వ్యయంతో చేపడుతున్న ఈ పనుల ద్వారా సుమారు 730 మ్యాండేస్ ఉపాధి కల్పించబడుతోంది. పనులు పూర్తయ్యాక తెలుగుగంగ కాలువ 9వ బ్లాక్ నుంచి నీరు సాఫీగా ప్రవహించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ కాలువ ద్వారా బుక్కాపురం బొల్లవానికుంట నిండి, అక్కడి నుంచి ఎ.కోడూరు వరకు సాగునీరు అందనుంది.దీంతో 32 మంది రైతులకు చెందిన సుమారు 94 ఎకరాల భూమికి నీరు అందించి, వర్షాలపై ఆధారపడే పరిస్థితి తగ్గనుంది. కాలువ పునరుద్ధరణతో పంటలు మెరుగై రైతులకు ఊరటనిస్తుందని అధికారులు తెలిపారు.గ్రామ రైతు పాలుస్వామి మాట్లాడుతూ, పూడికతీత పనులతో నీటి ప్రవాహం సజావుగా జరిగి పంటలకు ముంపు ప్రమాదం తగ్గుతుందని, కూలీలకు ఉపాధి కూడా లభిస్తోందని తెలిపారు.

## ఏపీలో ఇంధన కొరతపై వైసీపీ ఆందోళన--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి , ఏప్రిల్ 28: ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్, డీజిల్ కొరత కృత్రిమంగా సృష్టించబడుతోందని వైసీపీ నేతలు ఆరోపించారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ నంద్యాల పట్టణంలోని డేనియల్‌పురం నయారా పెట్రోల్ బంక్ వద్ద మాజీ ఎమ్మెల్యే కిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇసాక్ బాష సహా పలువురు నేతలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ రాష్ట్రంలో మాత్రమే ఇంధన సంక్షోభం ఉండటం కూటమి నేతల ప్రణాళికలో భాగమని ఆరోపించారు. రాష్ట్రంలో సుమారు 70 శాతం పెట్రోల్ బంకుల వద్ద 'నో స్టాక్' బోర్డులు కనిపిస్తున్నాయని తెలిపారు. పొరుగు రాష్ట్రాల్లో ఇలాంటి పరిస్థితి లేదని, సరఫరాలో ఎటువంటి లోటు లేదని కేంద్రం స్పష్టం చేసినప్పటికీ ఇక్కడ కొరత ఎందుకు ఏర్పడిందో ప్రభుత్వం వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఇంధన కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే సరఫరా సాధారణ స్థితికి తీసుకురావాలని వారు కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా, మండల స్థాయి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం---



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 28: పట్టణంలోని 11వ వార్డు చాంద్‌బాడలో పారిశుద్ధ్య కార్మికులను జోయా సహాయ హస్తం సభ్యులు, ఎస్‌డిపివై పార్టీ నాయకులు సన్మానించారు. వారి సేవలను అభినందిస్తూ అల్పాహారం ఏర్పాటు చేసి, అనంతరం శాలువాలు కప్పి ఫలాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎస్‌డిపివై పార్టీ నంద్యాల అసెంబ్లీ కార్యవర్గ సభ్యుడు షేక్ కరీముల్లా మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల సేవలు సమాజానికి అమూల్యమని, వారి కృషి వల్లే ప్రజలు ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవిస్తున్నారని పేర్కొన్నారు. వారిని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.ప్రజలు చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా సక్రమంగా సేకరించి కార్మికులకు అందించాలని, పరిశుభ్రతకు సహకరించాలని సూచించారు. కార్మికులు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉన్నందున వారికి అవసరమైన సహకారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమానికి సచివాలయ పరిపాలనా కార్యదర్శి జాస్మిన్, పారిశుద్ధ్య కార్యదర్శి నాగేంద్ర, మేస్త్రి నసీర్ సహకరించగా, సభ్యులు ఇస్మాయిల్, ఇస్రాత్, జరీనా, ఫైరోస్ పాల్గొన్నారు.

## అరాచక శక్తులకు సహించేది లేదు

### ఎస్పీ ఎ. ఆర్.దామోదర్ మాస్ వార్నింగ్

విజయనగరం,విజయనగరం పట్టణంలో తరచూ అల్లర్లకు పాల్పడుతూ, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న యువకులకు పోలీసులు గట్టిగా వార్నింగ్ ఇచ్చారు. జొన్నగుడ్డి, లంకాపట్నం తదితర ప్రాంతాల్లో జిల్లా ఎస్పీ ఏ.ఆర్ దామోదర్ ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190